## 7వ అధ్యాయం

# ఆస్తి వారసత్వం

★ ఆస్తి పంపకానికి ప్రాథమిక సూత్రాలు 249

★ ఆస్తి వాటాలు 250

★ మూడోవంతు కంటే ఎక్కువ ఆస్తి మీద వీలునామా చెల్లదు 251



https://teluguislam.net

# ఆస్తి వారసత్వం

వారసత్వపు ఆస్తి పంపిణీకి ఇస్లాం ధర్మం ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. ఆస్తి పంపిణీకి సంబంధించిన విద్య ప్రతి ముస్లిం స్వయంగా తాను నేర్చుకోవటమే గాకుండా ఇతరులకు కూడా నేర్పాలని దైవప్రవక్త (సల్లం) ముస్లింలకు తాకీదు చేశారు. ఆయన తన అనుచరులకు హితోపదేశం చేస్తూ "మీ విధులేమిటో తెలుసుకోండి. మీ ఆస్తి పంపకానికి సంబంధించిన జ్ఞానం సగం జ్ఞానంతో సమానం" అని చెప్పారు. (ఇబ్నెమాజా)

## ఆస్తి పంపకానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలు

వారసులు మృతునికి సంబంధించిన మూడు విధాల ఖర్చులు చెల్లించ నంతవరకు అతని ఆస్తి నుండి తమ వాటలు పంచుకోవటానికి వీల్లేదు.

1. అతను చేసిన అప్పులన్నీ తీర్చాలి. మృతుని భార్యకు భర్త నుంచి మహర్ సొమ్ము లభించకపోతే అది కూడా అప్పు క్రిందికే వస్తుంది. కనుక దాన్ని కూడా వారసులు ఆమెకు చెల్లించిన తర్వాతనే తమ వాటలు పంచు కోవలసి ఉంటుంది.

2. అతని శవసంస్కారానికి సంబంధించిన ఖర్చులు తీయాలి.

3. మృతుడు గనక వీలునామా రాసిపోతే దాని ప్రకారం ఎవరెవరికి, ఏఏ సత్కార్యాలకు ఎంతెంత ఇవ్వాలో ఆ డబ్బు కూడా ఆయా వ్యక్తులకు, సత్కార్యాలకు ఇచ్చేయాలి.



https://teluguislam.net

# ఆస్తి వాటాలు

| మృతుని బంధువు | నియమాలు | లభించవలసిన వాటా |
|---|---|---|
| తండ్రి | 1. మృతునికి కొడుకు, మనవడు ఉన్నప్పుడు | 1/6 వంతు |
| | 2. మృతునికి కుమారుడు, మనవడు లేకుండా కూతురు, మనవరాలు ఉన్నప్పుడు | 1/6+వాటా దారులకు పోగా మిగిలినది |
| | 3. మృతునికి సంతానం లేనప్పుడు | వాటాదారులకు పోగా మిగిలిన మొత్తం |
| భర్త | 1. మృతురాలికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు లేనప్పుడు | 1/2 వంతు |
| | 2. మృతురాలికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు ఉన్నప్పుడు | 1/4 వంతు |
| భార్య | 1. మృతునికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు లేనప్పుడు | 1/4 వంతు |
| | 2. మృతునికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు ఉన్నప్పుడు | 1/8 వంతు |
| తల్లి | 1. మృతునికి సంతానంగాని లేక ఇద్దరు అన్నాచెల్లెళ్ళు గాని లేనప్పుడు | 1/3 వంతు |
| | 2. మృతునికి సంతానంగాని లేక ఇద్దరు అన్నాచెల్లెళ్ళు గాని ఉన్నప్పుడు | 1/6 వంతు |
| | 3. మృతుని భార్య, తండ్రి తప్ప ఇతర వారసులు ఎవరూ లేనప్పుడు | 3/4లో 1/3 వంతు = 1/4 |
| | 4. మృతురాలి భర్త, తండ్రి తప్ప ఇతర వారసులు ఎవరూ లేనప్పుడు | 1/2లో 1/3 వంతు=1/6 |
| కూతురు | 1. మృతునికి ఒకే కూతురు ఉండి కుమారులు ఎవరూ లేనప్పుడు | 1/2 వంతు |
| | 2. మృతునికి ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ కూతుళ్లు ఉండి కుమారులు ఎవరూ లేనప్పుడు | 2/3లో అందరూ సమానం |
| | 3. మృతునికి కూతురుతోపాటు కొడుకు కూడా ఉన్నప్పుడు | కొడుకు వంతులో సగం |



https://teluguislam.net

## కొడుకు వాటా

హక్కుదారులకు వారి వాటాలు ఇచ్చిన తరువాత మిగిలిన ఆస్తి మొత్తం కొడుక్కే చెందుతుంది.

## మూడోవంతు కంటే ఎక్కువ ఆస్తి మీద వీలునామా చెల్లదు

ఇస్లాం ప్రారంభ కాలంలో వారసత్వపు ఆస్తి పంపకం గురించి దైవాదేశాలు అవతరించక ముందు వారసుల మధ్య గొడవలు రాకుండా ఉండేందుకు ప్రతి వ్యక్తీ (తన మరణానికి ముందు) విధిగా వీలునామా ద్వారా తన వారసుల వాటాలను నిర్ణయించాలని ఖుర్‌ఆన్‌లో ఆదేశించబడింది. ఆ తర్వాత కొంత కాలానికి దేవుడు స్వయంగా వారసుల వాటాలకు సంబంధించిన ఆజ్ఞలు అవతరింపజేశాడు. దానితో ఇక వారసుల కొరకు వీలునామా రాసే ఆజ్ఞ రద్దయి పోయింది. ఆ తర్వాత నుంచి దేవుడు నిర్ణయించిన వాటాల ప్రకారమే వారసుల్లో ఆస్తి పంపకం జరగాలని ఆదేశించబడింది.

కనుక దాని ప్రకారం ఈ రోజు కూడా దేవుడు నిర్ణయించిన వాటాలలో ఎవరూ ఏ విధంగానూ ఎక్కువ తక్కువలు చేయరాదు. ఒకవేళ వారసులు కానివారికి ఏదయినా సహాయం చేయదలిస్తే మొత్తం ఆస్తిలో మూడోవంతుకు లోపుగా మాత్రమే వీలునామా రాయాలని దైవప్రవక్త (స) బోధించారు. కనుక మొత్తం ఆస్తిలో 1/3 వంతు లోపుపై మాత్రమే వీలునామా రాయాలి. అంతకు మించిన పైకంపై వీలునామా రాసినా అది చెల్లదు.

హజ్రత్ సాద్ బిన్ అబూ వఖ్ఖాస్ (రజి ) కథనం: దైవప్రవక్త (సల్లం) తాను అంతిమ హజ్‌యాత్ర చేసిన యేట వ్యాధిగ్రస్తుణ్ణయి వున్న నన్ను పరామర్శించే నిమిత్తం నా వద్దకు వచ్చారు. అప్పుడు నేను ఆయన్ని “దైవప్రవక్తా! నా వ్యాధి ఎంత తీవ్రంగా తయారయిందో తమరు చూస్తూనే ఉన్నారు. నేనా డబ్బు కలవాణ్ణి. నాకు ఒక్కగానొక్క కూతురు తప్ప ఇతర వారసులెవరూ లేరు. నేను నా ధనం లోని మూడింట రెండొంతులను ఎవరికైనా దానం చేయవచ్చా?” అని అడిగాను. దానికి ఆయన “కూడదు” అన్నారు. తిరిగి నేను “సగం ధనం దానం చేయనా”



https://teluguislam.net

అని అడిగాను. దానికి కూడా ఆయన "కూడదు" అనే అన్నారు. మళ్ళీ నేను "మూడింట ఒక వంతైనా దానం చేయలేనా దైవ ప్రవక్తా!" అని విన్నవించుకోగా, అందుకు ఆయన "మూడింట ఒక వంతు అయితే చేయగలవు. కాని అది కూడా ఎక్కువే అవుతుంది. ఎందుకంటే నువ్వు నీ వారసులను పరుల ముందు చేయి చాపుతూ తిరిగే దరిద్రులుగా వదలివెళ్ళడం కన్నా స్థితిమంతులుగా వదలి వెళ్లడమే ఎంతో శ్రేయస్కరం" అని అన్నారు.

చెప్పొచ్చేదేమిటంటే ఆస్తిపరుడు తాను స్వయంగా వాటాలు వేయడం గాని, వారసుల కొరకు వీలునామాలు రాయటం గాని చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే వారసుల హక్కులు, వారి వాటాలు అన్నీ దేవుని తరఫునుంచే నిర్ణయించబడి ఉన్నాయి. ఇక వాటిలో ఎలాంటి హెచ్చుతగ్గులకూ ఆస్కారం లేదు. ఆస్తిపరుడు కావాలని ఏ వారసునికీ నష్టం చేయలేడు. అలాగే ఒక మనిషి చనిపోయిన తర్వాత మాత్రమే అతని ఆస్తి వారసుల్లో పంచబడుతుంది. తండ్రి బ్రతికుండగానే తన వాటా ఇవ్వమని అడిగే అధికారం కొడుక్కి లేదు.



https://teluguislam.net